# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-05-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు జరిగే ఫించన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.**
2. **వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ అన్నారు.**
3. **హైదరాబాద్ లో ఈరోజు సాయంత్రం ప్రపంచ సుందరి-2025 ఫైనల్ పోటీలు జరుగుతాయి.**
4. **ఆంధ్రప్రదేశ్ లో రేపటి నుంచి చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**
5. **అవినీతిరహిత పాలన అందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటిస్తారు. జిల్లాలోని కాట్రేనికోన మండలం చెయ్యేరులో నిర్వహించే పింఛన్ల పంపిణీ, పీ4 కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. పర్యటనలో భాగంగా తొలుత చెయ్యేరులో 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొంటారు. ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి చేస్తున్న చెరువు పనులను పరిశీలించి, శ్రామికులతో మాట్లాడతారు. లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తారు. తర్వాత అదే గ్రామంలో ప్రజావేదిక వద్దకు చేరుకొని స్థానికులతో సమావేశమవుతారు. ఎంపిక చేసిన బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునే కార్యక్రమంలో పాల్గొంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య- సీఐఐ వార్షిక సమ్మేళనంలో నిన్న ముఖ్యమంత్రి పాల్గొని ప్రభుత్వ విధానాలు, రాష్ట్రంలో అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలను వివరించారు. సంపద సృష్టి పారిశ్రామికవేత్తల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. సంపద సృష్టిలో రాష్ట్రానికి పారిశ్రామిక వేత్తలు సహకరించాలని కోరుతూ,

వాయిస్ .. 22 సెకన్లు

---------------------------

ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం కింద 'అడవితల్లి బాట' పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో వెయ్యి కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న రహదారులు ఆదివాసీల జీవనశైలిని మారుస్తున్నాయని ఉపముఖ్యమంత్రి కె పవన్‌కల్యాణ్ అన్నారు. వెనుకబడిన ప్రాంతాల్లోని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి వారు సమగ్రాభివృద్ధి సాధించేలా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. జన్‌మన్ పథకంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా లక్కవరం నుంచి చెడిగొండ వరకు 87.18 లక్షలతో నిర్మించిన రహదారి పనులకు సంబంధించిన చిత్రాలను ఎక్స్‌లో పంచుకున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 1 నుంచి డీలర్ల రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీకి సిద్ధం కావాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. గుంటూరు జిల్లా తెనాలిలో మంత్రి నిన్న రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే పంపిణీ చేస్తామని చెప్పారు. పాత కార్డుల స్థానంలో కొత్త స్మార్ట్ కార్డులను అందిస్తామని మంత్రి పేర్కొంటూ,

..వాయిస్.. 28 సెకన్లు

---------------------------

హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రపంచ సుందరి-2025 పోటీలు తుది దశకు చేరుకున్నాయి. నగరంలోని హైటెక్స్ వేదికగా ఈ సాయంత్రం మిస్‌వరల్డ్ పోటీల ఫైనల్ జరగనుంది. కిరీటాన్ని సొంతం చేసుకునేందుకు 108 దేశాల సుందరీ మణులు పోటీపడుతున్నారు. మిస్ ఇండియా నందిని గుప్తా సహా 16 మంది ఇప్పటికే టాప్ 40కి చేరుకున్నారు. మరో 24 మందిని న్యాయనిర్ణేతలు ఈ రోజు ఎంపిక చేయనున్నారు. అనంతరం చివరి దశలో అమెరికా-కరేబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియా-ఓషియానా ఖండాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసి ఈ నలుగురిలో తుది ప్రశ్న ద్వారా మిస్‌వరల్డ్‌ను ప్రకటిస్తారు.

---------------------------

అవినీతిరహిత పాలన అందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, వానాకాలం పంట సన్నద్ధతపై నిన్న సమీక్షించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్...27 సెకన్లు

---------------------------

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. పొగాకు ఉత్పత్తుల వాడకం వలన ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాల పట్ల ప్రజలకు అవగాహన కలిగించే లక్ష్యంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ 1987 నుంచి ప్రతీఏటా మే 31వ తేదీన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని నిర్వహిస్తోంది. పొగాకు వాడకాన్ని వీడాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కాగా.. ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ప్రసారమవుతుంది.

---------------------------

దేశంలోని మారుమూల ప్రాంతాలు మొదలుకొని ప్రపంచ దేశాలకి సంబందించిన రోజువారీ విశ్వసనీయమైన సమాచారాన్ని ప్రసారభారతి షబ్ద్ పోర్టల్ వార్తా కథనాల రూపంలో ఉచితంగా అందిస్తోంది. అనేక అంశాలకు సంబంధించి రోజుకి 800కి పైగా వార్తా కథనాలను 15 ప్రాంతీయ భాషల్లో షబ్ద్ పోర్టల్ ద్వారా వీక్షించవచ్చు. కాగా ఈ షబ్ద్ పోర్టల్‌లోని సమాచారాన్ని కంటెంట్ క్రియేటర్స్, యూట్యూబర్స్‌తో పాటు ఎవరైనా ఉచితంగా ఉపయోగించుకోవచ్చని ఎటువంటి కాపీరైట్స్ సమస్యలు ఉండవని ప్రసారభారతి ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

విదేశాలలో పర్యటిస్తున్న శశి థరూర్ నేతృత్వంలోని అఖిల పక్ష పార్లమెంట్ సభ్యుల బృందం కొలంబియాలో పర్యటిస్తోంది. ఈ సందర్భంగా కొలంబియన్ జాతీయ అసెంబ్లీలో ఆ దేశ నాయకులైన అలెజాండ్రో టోరో, జైమ్ రౌల్ సలామాంకాతో సమావేశమైంది. ఈ సందర్భంగా వారు సార్వభౌమత్వాన్ని రక్షించుకునే హక్కు భారత్ కు ఉందని తమ మద్దతును ప్రకటించారు.

మరోవైపు బిజెపి ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని అఖిల పక్ష పార్లమెంట్ సభ్యుల బృందం డెన్మార్క్ పార్లమెంట్ విదేశీ విధాన కమిటీ చైర్మన్ క్రిస్టియన్ ఫ్రీస్‌తో సమావేశమయ్యింది. ఈ సందర్భంగా భారతదేశం ఉగ్రవాద దాడులకు ప్రతీకారంగా నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ గురించి ఎంపీల బృందం తెలియచేసింది. ఉగ్రవాద కట్టడికి డెన్మార్క్ మద్దతు ఇస్తుందని క్రిస్టియన్ ఫ్రీస్ తెలిపారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితి గురించి వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలుపుతూ,

వాయిస్... 30 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ ఈరోజు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ప్రకృతి సౌందర్యం, గొప్ప సంస్కృతికి గోవా రాష్ట్రం నిదర్శనమని ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ తెలిపారు. 'ఏక్ భారత్.. శ్రేష్ఠ్ భారత్' కార్యక్రమంలో భాగంగా విజయవాడ రాజ్‌భవన్‌లోని నిర్వహించిన గోవా రాష్ట్ర అవతరణ దినోత్సవంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ఆహ్లాదకరమైన బీచ్‌లతో ఆతిథ్య రంగంలో గోవా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. 'గోవా అతి చిన్న రాష్ట్రమైనప్పటికీ

దేశానికి ఆర్థిక సహకారాన్ని అందిస్తోందని చెప్పారు పర్యాటకాభివృద్ధి, అధిక అక్షరాస్యత, గొప్ప జీవన వైవిధ్యంతో గోవా రాష్ట్రం తనదైన ముద్ర వేసుకుందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడా రంగానికి ప్రాధాన్యతనిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని ఆ శాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని స్థానిక కళాశాలలో నిర్వహించిన వేసవి క్రీడల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రతిభ కనపర్చిన వారికి చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత నెల రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులకు వివిధ క్రీడలలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించి గొప్ప క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. రాయచోటి ప్రాంతాన్ని క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

=====================